batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

30 జూలై 2026
గురువారం

### సమస్త జీవరాశుల

# ఉమ్మడి నివాసమే భూమి

### పులుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

### మంత్రి కొండా సురేఖ

02

హైదరాబాద్, బతుకమ్మ :పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ లశాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసమని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆమె కోరారు.



అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆమె పరిశీలించారు. పులుల సంరక్షణపై రూపొం దించిన లఘు చిత్రాన్ని వీక్షించారు. కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యా లయం వైస్ ఛాన్సలర్ దండా రాజిరెడ్డి, పీసీసీఎఫ్ (డెవలప్‌మెంట్) రత్నాకర్ జౌహరి, సీసీఎఫ్ టీజీఎస్ఎఫ్ఏ డైరెక్టర్ ప్రియాంక వర్గీస్, సీసీఎఫ్ ఎన్. క్షితిజ, టైగర్ సెల్ రీసెర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం తదితర అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఈ కార్యక్రమం ప్రారంభమైం దని, ప్రస్తుతం ఇది ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా మారిందని పేర్కొన్నారు. పులి అటవీ సంపద కు ప్రతీక అని, పులిని కాపాడటం అంటే అడవులను, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును కాపాడటమేనని మంత్రి అన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో పులుల సంఖ్య గతంలో గణనీయంగా తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. పులుల సంరక్షణ కోసం నాటి ప్రధాని ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో "ప్రాజెక్ట్ టైగర్" కార్యక్రమాన్ని ప్రారంభించి దేశవ్యా ప్తంగా కీలక చర్యలు చేపట్టిందని మంత్రి వివరించారు. ఈ చర్యల ఫలితంగా భారత్ ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ప్రపంచం లోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం పులులు ప్రస్తుతం భారతదేశంలోనే ఉన్నాయని, దేశవ్యాప్తంగా 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు.



# కామారెడ్డిపై వరుణుడి పంజా

06

### ఒక్క రోజులో 555% అధిక వర్షం

### ప్రాజెక్టులకు భారీ వరద

కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి జిల్లాలో బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలోని మొత్తం 25 మండలాల్లోనూ విస్తారంగా వర్షపాతం నమోదైంది. తెలంగాణ డెవలప్‌మెంట్ సొసైటీ విడుదల చేసిన గణాంకాల ప్రకారం జిల్లా సగటు వర్షపాతం 61.6 మి.మీగా నమోదైంది. సాధారణంగా ఈ తేదీన 9.4 మి.మీ వర్షపాతం నమోదవుతుండగా, ప్రస్తుతం సాధారణం కంటే ఏకంగా 555 శాతం అధికంగా వర్షం కురిసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. జూన్ 1 నుంచి ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 401.3 మి.మీ వర్షపాతం నమోదైంది. సాధారణ సీజనల్ వర్షపాతం 375.5 మి.మీతో పోలిస్తే ఇది 7 శాతం అధికం. ప్రస్తుతం జిల్లా మొత్తం వర్షపాత స్థితి సాధారణ స్థాయిలోనే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని 25 మండలాల్లో 20 మండలాలు సాధారణ వర్షపాత కేటగిరీలో ఉండగా, నాలుగు మండలాలు అధిక వర్షపాతం (ఎక్స్ సెస్) కేటగిరీలో ఉన్నాయి. భిక్కనూరు మండలం అత్యధిక వర్షపాతం నమోదైన పెద్ద అధిక (లార్జ్ ఎక్స్ సెస్) కేటగిరీలో కొనసాగుతోంది. ఈ సీజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదైన మండలాల్లో పిట్లం మండలం 99.4 మి.మీతో మొదటి స్థానంలో నిలిచింది. మహమ్మద్ నగర్ మండలంలో 96 మి.మీ, జుక్కల్ మండలంలో 95.6 మి.మీ, రాజంపేటలో 72.6 మి.మీ, గాంధారిలో 69.9 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ ఐదు మండలాల్లో సాధారణం కంటే ఆరు నుంచి పది రెట్లు అధికంగా వర్షం కురిసింది. బాన్సువాడ మండలంలో 58 మి.మీ వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఇక్కడ 12.5 మి.మీ వర్షం పడాల్సి ఉండగా, 364 శాతం అధికంగా వర్షం కురిసింది. సీజన్ మొత్తంగా బాన్సువాడలో 466.8 మి.మీ వర్షపాతం నమోదైంది. భిక్కనూరు మండలం లార్జ్ ఎక్స్‌సెస్ కేటగిరీలో కొనసాగుతోంది. బుధవారం ఇక్కడ 67 మి.మీ వర్షపాతం నమోదవగా, సీజన్ మొత్తం 560.4 మి.మీ వర్షం కురిసింది. ఇది సాధారణ వర్షపాతంతో పోలిస్తే 60 శాతం అధికం.

### సింగరేణి అనుబంధ సంస్థ ఆప్మెల్‌లో

# 'సోలార్' వెలుగు

### సీసీ, ఆర్‌సీసీ రోడ్ల ప్రారంభం

### సోలార్ తో ఏటా రూ.24 లక్షల విద్యుత్ ఖర్చు ఆదా

### ఈ ఏడాది రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభం నమోదుపై హర్షం

### స్వర్ణోత్సవ సంవత్సరంలో బహుముఖ వ్యాపార విస్తరణకు పిలుపు



02



02

### రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని

# గణనీయంగా పెంచాలి

హైదరాబాద్, బతుకమ్మ :రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, వాటి ఉత్పాదక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.
రాష్ట్రంలో షుగర్ పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు పంట విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.నెం. 86 ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం బుధవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగింది.

# రక్తానికి ప్రత్యామ్నాయం లేదు

### రక్తదానంతోనే ప్రాణరక్షణ

### డీఎస్పీ మధుసూదన్

02



కామారెడ్డి, బతుకమ్మ :వైద్యరంగం ఎంతగానో అభివృద్ధి చెందినప్పటికీ రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని, మానవతా దృక్పథంతో రక్తదాతలు ముందుకు వస్తేనే బాధితులకు సకాలంలో రక్తం అందించి ప్రాణాలను కాపాడగలమని కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రామారెడ్డి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రెయిన్‌బో బ్లడ్ బ్యాంక్ ను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) నరహరితో కలిసి ఆయన బుధవారం లాంఛనంగా ప్రారంభించారు.
తలసేమియా చిన్నారులకు రక్తదానం ప్రాణాధారంఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా హాజరైన ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు మాట్లాడుతూ... అత్యవసర సమయంలో రక్తం దొరకక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసమే భూమి

తెలంగాణ రాష్ట్రానికి కూడా పులుల సంరక్షణలో ప్రత్యేక స్థానం ఉందని మంత్రి పేర్కొన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రముఖ పులుల అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, పులుల ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల కారణంగా పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి వివరించారు. కవ్వాల్ టైగర్ రిజర్వులో పులుల సంఖ్యను పెంచేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వును మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానించి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజల్లో



పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు అటవీ శాఖ పలు కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి తెలిపారు. అడవులను కాపాడుకుందామని, వన్యప్రాణులను సంరక్షిద్దామని, భావితరాలకు పచ్చని తెలంగాణను అందిద్దామని ఆమె పిలుపునిచ్చారు. ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల అభ్యర్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ అటవీ సంపద పరిరక్షణలో నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో పనిచేసి భావితరాలకు పచ్చని తెలంగాణను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో విశేష సేవలందించిన పలువురు అటవీ శాఖ ఉద్యోగులకు మంత్రి కొండా సురేఖ ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులను అందించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు కూడా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

## రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలి

సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం 7 కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటే ఏటా సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమవుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వివరించారు వరి పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. 2026--27 వ్యవసాయ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు తెలిపారు. చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు, చక్కెర పరిశ్రమలకు అవసరమైన ముడి చెరకు లభ్యతను మెరుగుపరచేందుకు ఇతర రాష్ట్రాల్లో



అమలు చేస్తున్న ప్రోత్సాహకాలు, విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను తక్షణమే సమర్పించాలని అధికారులను ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. సమావేశంలో రైతు ప్రతినిధులు మాట్లాడుతూ, చెరకు రైతులకు కూడా వరి రైతులకు అందిస్తున్న తరహాలో టన్నుకు రూ.500 ప్రోత్సాహకం అందించాలని కోరారు. చెరకు సాగులో అధిక పెట్టుబడి, వ్యవసాయ కూలీల కొరత రైతులకు ప్రధాన సవాళ్లుగా మారాయని వివరించారు. చెరకు ద్వారా చక్కెరతో పాటు ఇథనాల్, విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమవుతుందని పేర్కొంటూ, ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన పర్యవేక్షణకు ఆదేశాలు

### పీసీపీఎన్‌డీటీ జిల్లా సలహా సంఘ సమావేశం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డా. రాజశ్రీ అధికారులకు సూచించారు. పీసీపీఎన్‌డీటీ జిల్లా సలహా సంఘ సమావేశం బుధవారం డీఎంహెచ్‌ఓ డా. రాజశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో కనీసం 10 ఫామ్-ఎఫ్‌లను పరిశీలించాలని తెలిపారు. ఒకే కేంద్రంలో ఎన్ని స్కానింగ్ యంత్రాలు ఉన్నప్పటికీ ప్రతి యంత్రానికి సంబంధించిన నివేదికలను ప్రతినెలా సమర్పించాలని ఆదేశించారు. స్కానింగ్‌కు వచ్చే గర్భిణీలకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన రెఫరల్ స్లిప్ తప్పనిసరిగా ఉండాలని, అందులో ఆబ్‌స్టెట్రిక్ ఫార్ములా నమోదు చేయాలని సూచించారు. అనర్హుల నుంచి వచ్చే రెఫరల్స్‌పై స్కానింగ్ చేయరాదని స్పష్టం చేశారు. స్కానింగ్ చేయించుకునే వారి ఆధార్ నంబర్‌తో పాటు ఇతర పూర్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో లింగ నిర్ధారణ పరీక్ష చేయడం చట్టరీత్యా నేరమనే విషయాన్ని తెలియజేసే ఫ్లెక్సీలను కనీసం మూడు భాషల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ఫ్లెక్సీలను వెయిటింగ్ హాల్‌తో పాటు స్కానింగ్ రూమ్‌లో కూడా ఉంచాలని తెలిపారు. అలాగే పీసీపీఎన్‌డీటీ సర్టిఫికెట్‌ను రిసెప్షన్‌లో అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని పేర్కొన్నారు. స్కానింగ్ యంత్రాలను ఒక కేంద్రం నుంచి మరొక కేంద్రానికి మార్చకూడదని, అవసరమైతే సంబంధిత అధికారి నుంచి ముందస్తుగా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్




(ఎన్‌ఓసీ) పొందాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. సమావేశంలో కొత్తగా మూడు స్కానింగ్ కేంద్రాలకు, ఐదు రెన్యూవల్ దరఖాస్తులకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డా. రాజశ్రీతో పాటు పిల్లల వైద్య నిపుణులు డా. దీపక్ రాథోడ్, గైనకాలజిస్ట్ డా. ఇందు, రేడియాలజిస్ట్ డా. నిశిత, డా. శిఖర, డా. సుప్రియ, ఎన్జీఓ ప్రతినిధి పద్మసింగ్, జిల్లా సమాఖ్య డీఆర్‌డీఏ నుంచి ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డా. విద్య (బోధన్), డా. రవీందర్ (ఆర్మూర్), డా. సికిందర్ (నిజామాబాద్), వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వేణుగోపాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి అనుబంధ సంస్థ ఆప్మెల్‌లో 'సోలార్' వెలుగు

వెబ్ డెస్క్, బతుకమ్మ :విజయవాడలో ఉన్న సింగరేణి అనుబంధ సంస్థ అయిన ఆప్మెల్ (ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్) స్వర్ణోత్సవాల సందర్భంగా ప్లాంట్ లో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ను సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి బుధవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వర్చువల్ గా ప్రారంభించారు. అలాగే మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్లాంటులో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, ఆర్ సి రోడ్లను కూడా ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖామాత్యులు భట్టి విక్రమార్క మార్గనిర్దేశంలో సింగరేణితో పాటు అనుబంధ సంస్థ అయిన ఆప్మెల్ ను బహుముఖంగా విస్తరించే ప్రణాళికతో ముందుకు వెళున్నట్లు తెలిపారు. 50 ఏళ్ల ఆప్మెల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.63.13 కోట్ల టర్నోవర్, రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభాలను ఆర్జించడంపై ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. గత ఏడాది రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆప్మెల్‌ను సందర్శించిన సమయంలో ఇచ్చిన దిశానిర్దేశం, స్ఫూర్తితో సాధించిన విజయంగా అభివర్ణించారు. అలాగే ప్లాంట్‌ను సందర్శించిన సమయంలో ప్లాంట్ లో సౌకర్యాల మెరుగుదలకు హామీ ఇచ్చారని ,ఆయన ఆదేశాల పైన ప్లాంట్ ఆవరణలో సిసి, ఆర్సిసి రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. సెప్టెంబరు 1, 1976 లో ప్రారంభమైన ఆప్మెల్ సంస్థ ఈ ఏడాది స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన



నేపథ్యంలో ప్రస్తుతం ప్లాంటులో తయారు చేస్తున్న యంత్ర పరికరాలు, విడిభాగాలతో పాటు రానున్న రోజుల్లో వివిధ పరిశ్రమల ఆధునిక అవసరాలను పరిగణనలోనికి తీసుకొని వ్యాపార విస్తరణ చర్యలు చేపట్టాలన్నారు. ఆప్మెల్ అభివృద్ధికి, ముఖ్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవడానికి, తద్వారా మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి సింగరేణి సంస్థ ఎప్పుడు సహకరిస్తూనే ఉంటుందన్నారు.
. . . సోలార్ ప్లాంట్ ఏర్పాటుతో విద్యుత్ ఖర్చులలో భారీ ఆదా
ఆప్మెల్ ప్లాంటు విద్యుత్, కాలనీ అవసరాలు కలిపి ప్రతీ ఏడాది 60 లక్షల రూపాయలు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం రూ.1.24 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సోలార్ ప్లాంట్ తో ఏడాదికి 24 లక్షల రూపాయలు ఆదా అవుతుంది. ఐదేళ్లలో పెట్టుబడి మొత్తాన్ని రాబట్టుకోవచ్చు. అలాగే పర్యావరణ హిత చర్యలకు ప్రోత్సాహం అందించినట్లు అవుతుంది. ఆప్మెల్ ఛైర్మన్ ఎన్‌వికె శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంస్థ అభివృద్ధికి చేపట్ంబోయే ప్రణాళికలను వివరించారు. సింగరేణి, కోల్ ఇండియా, ఎన్ఎండీసీ సంస్థల నుంచి లభించిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం.తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్ పాల్గొన్నారు. విజయవాడ ఆప్మెల్ నుంచి ఎండి ఎర్రన్న ఇంకా ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రక్తానికి ప్రత్యామ్నాయం లేదు

..ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తం అవసరమవుతుందని, అలాంటి పసికందుల ప్రాణాలను కాపాడేందుకు స్వచ్ఛందంగా రక్తదాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నూతనంగా రక్తనిధి కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చిన యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.

...ఆదర్శంగా నిలిచిన సైనికులు

కేంద్ర ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో కామారెడ్డి జిల్లా సెంట్రల్ ఆర్మ్డ్ పారామిలిటరీ ఫోర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎమ్.డి. గౌస్ ఉద్దీన్ ఆధ్వర్యంలో పలువురు సైనికులు, పోలీసులు రక్తదానం చేశారు. బీఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ బండి ప్రభాకర్, మోతాజి బాలకృష్ణ రావు, మాజీ సైనికుడు రంజిత్ రెడ్డి, కానిస్టేబుల్ బద్రి



స్వచ్ఛందంగా రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. రక్తదానం చేసిన వారిని డీఎస్పీ మధుసూదన్, సీఐ నరహరి సన్మానించి, ప్రశంసా పత్రాలతో పాటు 'ఉత్తమ రక్తదాత' పురస్కారాలను అందజేశారు. సరిహద్దుల్లో దేశ రక్షణకే కాకుండా, సమాజంలో ప్రాణాలను కాపాడేందుకు సైనికులు రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ అజయ్ పేరాల, ట్రాఫిక్ ఎస్ఐ చంద్రశేఖర్, ఐవీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలువేరి మారుతి, ఆర్కే విద్యాసంస్థల సీఈఓ జైపాల్ రెడ్డి, 24వ వార్డు కౌన్సిలర్ డాకి అరవింద్ రాజ్, బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు ససాల రాజు, భట్టు భరద్వాజ్, సైఫ్ నజీర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 100% పూర్తైన ఎస్ఐఆర్

### ఎమ్మెల్యే మదన్ మోహన్

ఎల్లారెడ్డి, బతుకమ్మ :ఎల్లారెడ్డి నియోజకవర్గంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం 100 శాతం విజయవంతంగా పూర్తయిందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తెలిపారు. ఈ





కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేసి రాష్ట్ర స్థాయిలో ఎల్లారెడ్డి నియోజకవర్గం మూడో స్థానంలో నిలవడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం కావడానికి అహర్నిశలు కృషి చేసిన మండల అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఎ లు), గ్రామ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు హృదయపూర్వక అభినందనలు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించి విజయవంతం చేసిన మండల అధ్యక్షులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందించారు. వారి సేవలను కొనియాడుతూ, రాబోయే కార్యక్రమాల్లోనూ ఇదే అంకితభావంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విజయం ఒక్కరి కృషి ఫలితం కాదని, కాంగ్రెస్ కుటుంబం మొత్తం కలిసికట్టుగా సాధించిన విజయమని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషి, నిబద్ధత వల్లే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొంటూ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

### బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాలను ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు క్రాస్ వెరిఫై చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు మరికొద్ది రోజులే మిగిలి ఉన్నందున ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాల్లో ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో సీ.ఈ.ఓ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు తుది గడువు సమీపించినందున ఓటర్ల నుంచి సేకరించిన అన్ని ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. బీఎల్‌వోలు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసే సమయంలో చేసిన పొరపాట్ల కారణంగా అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వా టికి ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బీఎల్‌వోలు నమోదు చేసిన ప్రతి వివరాన్ని ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా క్రాస్ వెరిఫై చేయాలని, ఏవైనా లోపాలు ఉంటే రెండు రోజుల్లో వాటిని సరిదిద్దాలని ఆదేశించారు. అనంతరం కూడా తప్పిదాలు గుర్తిస్తే సంబంధిత బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటామని సీఈఓ స్పష్టం చేశారు.పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉందని, సూపర్‌వైజర్లు బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుని వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తికాగా, 80 నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా డిజిటలైజేషన్ పూర్తైనట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని, ఈ విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు.అన్ని స్థాయిలలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతి గురించి వివరించాలని, పోలింగ్ స్టేషన్‌ల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్‌ఏలు) అందజేసి వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయలక్ష్మి, రవీందర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రభుత్వాలను నిలదీయాలి

## ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఎన్నికల సమయంలో ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రజలు నిలదీయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య పిలుపునిచ్చారు. బుధవారం కాలూరు గ్రామంలో ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో, గ్రామ నాయకుడు సరికెల సాయిలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన చట్టాలు రైతులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని భూమయ్య విమర్శించారు. ముఖ్యంగా జిరాంజి చట్టం వ్యవసాయ కూలీల ఉపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలను పట్టణ పరిధిలో కలపడం వల్ల ఉపాధి హామీ పనులు నిలిచిపోయాయని, పట్టణ పరిధిలోకి చేరిన గ్రామాల్లో కూడా ఉపాధి హామీ పనులను కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కూడా ఆశించిన స్థాయిలో జరగడం లేదని ఆయన విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగిలిన హామీలు అమలుకు నోచుకోలేదని, ముఖ్యంగా ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ ప్రాంతానికి చెందిన రైతులు చెరుకు సరఫరా చేసిన ఎన్ సిఎస్ఎఫ్ సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని పునఃప్రారంభిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే రైతులను నిరాశపరిచిందన్నారు. వెంటనే సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించి, దానిని బెల్లం ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేసి ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. కాలూరు గ్రామంలోని మొండికుంట ప్రభుత్వ భూమిలో గత 50 ఏళ్లుగా సాగు చేస్తున్న దళిత రైతులకు పట్టాలు మంజూరు చేసి, అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు.




అలాగే ఇళ్ల స్థలాలు లేని అర్హులైన పేదలకు స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి ఇస్తామని ప్రకటించిన రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సరికెల సాయిలు, కత్తుల సాయిలు, వేల్పూర్ రవి, సంజన, కే. రజిత తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్ ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోని అధికారులు

## తీర్మాన్‌పల్లి గ్రామ సచివాలయంలో ఆందోళనకర పరిస్థితి



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని తీర్మాన్‌పల్లి గ్రామ సచివాలయంలో షార్ట్ సర్క్యూట్ ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఘటన బుధవారం గ్రామసభ సందర్భంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ సచివాలయంలో గ్రామసభ కొనసాగుతుండగా, విద్యుత్ మీటర్ బోర్డు వద్ద నుంచి వంషపు నీరు ధార లుగా కారడం గమనించిన గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో అక్కడ కరెంట్ బిల్లుల వసూళ్ల కోసం వచ్చిన విద్యుత్ శాఖ బృంది పరిస్థితిని పరిశీలించి, విద్యుత్ బోర్డు నుంచి నీరు కారడం అత్యంత ప్రమాదకరమని, దానిని తాకితే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంద ని హెచ్చరించారు. అయితే ప్రమాదం గురించి తెలిసినప్పటికీ గ్రామపం చాయతీ అధికారులు, సిబ్బంది వెంటనే ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది, ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితులు ఉన్నాయని, షార్ట్ సర్క్యూట్ జరిగేలోపు తక్షణమే విద్యుత్ వ్యవస్థను మరమ్మతు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి వెంటనే స్పందించి, సచివాలయ సిబ్బంది, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

# ఘనంగా గురుపూజోత్సవం

## గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించిన దయానంద్ యోగా ట్రస్ట్





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : గురుపౌర్ణమి సందర్భంగా దయానంద్ యోగా ట్రస్ట్, సుభాష్‌నగర్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం యజ్ఞాన్ని నిర్వహించి, సూర్య దీక్షితులు గురువుగారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దయానంద్ యోగా కేంద్రం డైరెక్టర్ యోగా గురువు బి. రామచందర్ మాట్లాడుతూ, వ్యాస భగవానుడి జయంతిని పురస్కరించుకుని గురుపౌర్ణమిని భారతదేశంలో అనాదిగా జరుపుకుంటున్నామని తెలిపారు. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ దయానంద్ యోగా కేంద్రంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యోగ సాధకులు ఆసనాలకే పరిమితం కాకుండా ధ్యానం, ప్రాణాయామం వంటి సాధనలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. యోగా టీచర్లు ప్రతిరోజూ ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. కేంద్రంలో ఉదయం రెండు బ్యాచ్‌లలో, సాయంత్రం మహిళలకు ప్రత్యేక యోగా తరగతులతో పాటు ధ్యాన సాధన నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ, నిజామాబాద్ పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. కొండ ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. నిజామాబాద్ పట్టణంలోని ప్రతి డివిజన్‌లో ఒక యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా దయానంద్ యోగా కేంద్రం ఆధ్వర్యంలో డైరెక్టర్ యోగా గురువు బి. రామచందర్, యోగా గురువులు వై. ప్రభాకర్, రుక్మన్ రావు (ప్రిన్సిపల్)తో పాటు పలువురు యోగా టీచర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎన్. శివరాజ్, ఏ. శ్రీనివాస్, డి. కొండ మురళి, జి. శ్రీనివాస్ చారి, తోట రాజశేఖర్, యోగా టీచర్లు మెరుగు గురుపాదం, అశోక్ కుమార్, హెచ్. శ్రీనివాస్, రాజేందర్, కిరణ్ కుమార్, పద్మ, సుభాష్ చంద్రబోస్ తో పాటు పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.

# రోడ్లు, డ్రైనేజీల మరమ్మత్తులు చేపట్టాలి



కామారెడ్డి, బతుకమ్మ :వర్షాకాలం దృష్ట్యా పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీల మరమ్మత్తులు తక్షణమే చేపట్టాలని, అలాగే ఆషాడం బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి దేవాలయాల పరిసరాల్లో మొరం వేయించాలని కోరుతూ కామారెడ్డి మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్, డీఈకి బీజేపీ కౌన్సిలర్లు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ, ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడి ప్రజలు నడవడానికే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల వార్డుల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అత్యవసరంగా ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టి, అవసరమైన ప్రాంతాల్లో మొరం వేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు. అలాగే ఆషాడం బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి ఆలయాల పరిసరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బురద నివారణ కోసం మొరం వేయాలని అధికారులకు సూచించినట్లు బీజేపీ కౌన్సిలర్లు వెల్లడించారు.

# నెమలి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

## పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్



బాన్సువాడ, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని నసురుల్లాబాద్ మండలం నెమలి గ్రామంలో ఉన్న శ్రీ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుల ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలే మల్లికార్జున్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, జిల్లా ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సాయిబాబా స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి భక్తులను పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ భుజంగారి భాస్కర్ రెడ్డి, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రజా పండరి, నసురుల్లాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు యశ్వంత్ రెడ్డి, కమ్మ సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఎంపీడీవో శ్రీనివాస్

జుక్కల్, బతుకమ్మ :జుక్కల్ మండల కేంద్రంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న రెండు ఇళ్లను సందర్శించిన ఆయన, పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆలస్యం కాకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి అర్హులైన లబ్ధిదారుడు తన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. స్థానికంగా కొందరు లబ్ధిదారులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరిగిందని పేర్కొన్నారు. అయితే, ఇళ్ల నిర్మాణం పూర్తిచేసిన లబ్ధిదారులకు బిల్లులు త్వరగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, గత ప్రభుత్వ హయాంలో జుక్కల్ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగలేదని కొందరు స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం



అవసరమైన సహకారం అందించాలని, నిర్మాణాలు పూర్తి చేసిన వారికి పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో పోరాడుతాం

## సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్

రుద్రూర్, బతుకమ్మ :లేబర్ కోడ్ ల రద్దు కొరకు క్విట్ ఇండియా స్ఫూర్తితో పోరాడాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ పిలుపునిచ్చారు. బుధవారం రుద్రూర్ మండల కేంద్రంలో లేబర్ కోడ్ లపై పద్మ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్ లు, విద్యుత్ సవరణ చట్టం, వీబీ జీరాంజీ చట్టం కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, ఆగస్టు 10న చేపట్టనున్న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాల ని సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగామణి, భూలక్ష్మి, పద్మ, వాణి, రూప, లక్ష్మిపాల్గొన్నారు.



# గతంలో చేపట్టిన డ్రైనేజీ పూడికతీత పనుల ఫలితం

## వర్షపు నీరు సాఫీగా ప్రవాహం




బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలోని 13వ వార్డులో గతంలో చేపట్టిన డ్రైనేజీ పూడికతీత, చెత్త తొలగింపు పనుల వల్ల ప్రస్తుతం కురుస్తున్న వర్షాల సమయంలో డ్రైనేజీ కాలువల్లో నీరు ఎలాంటి ఆటంకం లేకుండా సాఫీగా ప్రవహిస్తోంది. గతంలో వర్షాకాలంలో పూడిక, చెత్త పేరుకుపోవడంతో నీటి నిల్వలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అయితే ముందస్తుగా మున్సిపల్ అధికారులు చేపట్టిన శుభ్రపరిచే పనుల కారణంగా ఈసారి వర్షపు నీరు సకాలంలో వెళ్లిపోతుండటంతో పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యలు తగ్గుముఖం పట్టాయి. డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు స్థానిక వార్డు కౌన్సిలర్ మొహమ్మద్ ఖలేఖ్,మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఖామర్ సుల్తానా గౌస్ పాషా పర్యవేక్షిస్తూన్నారు. ప్రజలు కూడా డ్రైనేజీల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేయకుండా సహకరిస్తే వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగు సమస్యలను నివారించవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రెండు రోజుల పాటు భారీ వర్షాల హెచ్చరిక

## అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచన



ములుగు, బతుకమ్మ :రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవ రావు ఆదేశించారు. ఈ మేరకు జిల్లా అధికారులతో పాటు అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, నీటిపారుదల శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా అన్ని శాఖలు సమన్వయంతో వెంటనే స్పందించేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, నీటిపారుదల శాఖ అధికారులు తప్పనిసరిగా తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అత్యవసరం అయితే తప్ప వరద నీటిలోకి వెళ్లవద్దని, వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దని, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. రహదారులు దెబ్బతినడం, చెట్లు కూలిపోవడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడం, నీటిమునిగిన ప్రాంతాలు ఏర్పడడం వంటి ఘటనలు చోటుచేసుకున్న వెంటనే సంబంధిత శాఖల అధికారులు స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో వరదలు, రహదారుల దెబ్బతినడం, చెట్లు కూలిపోవడం, నీటిమునిగిన ప్రాంతాలు ఏర్పడడం లేదా ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఇతర ఘటనలు చోటుచేసుకున్నట్లయితే వెంటనే జిల్లా ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం 24 గంటల పాటు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 7109కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. అందిన సమాచారంపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపడతారని పేర్కొన్నారు.

# కొండగట్టు ఆంజనేయస్వామి గిరిప్రదక్షిణలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు




జగిత్యాల, బతుకమ్మ :గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించిన గిరిప్రదక్షిణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. వారితో పాటు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కూడా గిరిప్రదక్షిణలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు నెలకొనాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాడి పంటలు సమృద్ధిగా పండాలని శ్రీ ఆంజనేయ స్వామిని ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. భక్తుల మధ్య ఆధ్యాత్మిక వాతావరణంలో గిరిప్రదక్షిణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్ట్

## రిమాండ్‌కు తరలింపు

హైదరాబాద్, బతుకమ్మ :తోటి మహిళా ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టైన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు రిమాండ్‌కు తరలిస్తున్నారు. మిర్యాలగూడ వద్ద అదుపులోకి తీసుకున్న ఆయనను అనంతరం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అత్తాపూర్ పీఎస్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారుల ఆధ్వర్యంలో ఉదయ్ కృష్ణారెడ్డిని సుదీర్ఘంగా విచారించారు. కేసు దర్యాప్తులో భాగంగా పలు అంశాలపై పోలీసులు వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఇప్పటికే బాధిత మహిళా ఐపీఎస్ అధికారిణి స్టేట్‌మెంట్‌ను నమోదు చేసింది. అలాగే, ఆమెకు వైద్య పరీక్షలు కూడా నిర్వహించినట్లు సమాచారం. పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డికి వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరచనున్నారు. కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు

# గురువు స్థానం దైవంతో సమానం

## పాద పూజ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :భారతీయ సాంప్రదాయంలో గురువు స్థానం దైవంతో సమానమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. గురు పూర్ణిమను పురస్కరించుకొని బుధవారం నగరంలోని బింగి కళ్యాణ మండపంలో గురువు కోన సముందర్ శ్రీనాథ్ శర్మ దంపతులకు కుటుంబసమేతంగా పాద పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గురువులు జీవితంలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన వెలుగును ప్రసాదిస్తారని పేర్కొన్నారు. వేల సంవత్సరాలుగా భారతదేశంలో కొనసాగుతున్న గురు శిష్య సంప్రదాయానికి ఈరోజు ప్రతీకగా నిలుస్తుంది అన్నారు. అనేకమంది సన్యాసులు, యోగులు ఈ రోజున కొత్త దీక్షలు, జపాలు, సాధనలు ప్రారంభిస్తారని తెలిపారు. గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు. గురువే పరబ్రహ్మ స్వరూపుడన్నారు. గురువులకు పాదపూజ చేయడం, తోచిన దక్షిణ, వస్త్రాలు, పండ్లు, పుస్తకాలు, సమర్పించడం ఆనవాయితీ అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, గురువు జీవితానికి అర్థాన్ని నేర్పుతారని అన్నారు. జ్ఞానం, వినయం, సంస్కారం, ధర్మం విలువలను గుర్తు చేసే పవిత్ర పర్వదినం అని వివరించారు. అంతకుముందు మల్లారంలోని దత్త ఆశ్రమాన్ని దర్శించుకున్నారు.

# జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల సత్తా

## గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలతో మెరిసిన గురుకుల విద్యార్థినులు....విజేతలను అభినందించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సి. శోభారాణి



కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని మర్కల్ గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ నెల 27న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో కళాశాల విద్యార్థినులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. జావెలిన్ త్రో మహిళల విభాగంలో ఎం. అమృత గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకుంది. అండర్-20 విభాగంలో బి. నవ్య గోల్డ్ మెడల్ సాధించగా, అండర్-18 విభాగంలో కే. స్వప్న సిల్వర్ మెడల్, ఎం. మహేశ్వరి బ్రాంజ్ మెడల్‌ను గెలుచుకుని కళాశాలకు కీర్తి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. శోభారాణి విజేతలను అభినందిస్తూ, క్రీడల్లోనూ విద్యార్థినులు ప్రతిభ కనబరచడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్. కృష్ణవేణి, ఫిజికల్ డైరెక్టర్ రమాదేవి, అధ్యాపక బృందం కూడా విజేత విద్యార్థినులను అభినందించి, వారి విజయాలకు సహకరించిన క్రీడా శిక్షకులను ప్రశంసించారు.

# ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం

## బీజేవైఎం అధ్యక్షులు వంశీ గౌడ్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు వంశీ గౌడ్ తెలిపారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన "ఫీజు బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా బుధవారం నిజామాబాద్ జిల్లా కిట్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బీజేవైఎం అధ్యక్షులు వంశీ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిస్డ్ కాల్, క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా విద్యార్థుల నుంచి మద్దతు సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కో-కోశాధికారి అమంద్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, కొందరు అప్పులు చేసి చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్య ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. జిల్లా బీజేవైఎం అధ్యక్షులు వంశీ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న "ఫీజు బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. కళాశాలలకు వెళ్లి విద్యార్థుల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని, మిస్డ్ కాల్, క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, లేకపోతే ఇందూరు జిల్లా వారిని అడ్డుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు విపుల్ రావు, రాజ్ గణేష్, రాకేష్, సిసింద్రీ, రాజశేఖర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాన్సువాడలో తాగునీటిపై మున్సిపాలిటీ హెచ్చరిక

## సింగూర్ నీటి రంగు మార్పు

## నీళ్ళు తాగొద్దని మున్సిపల్ కమిషనర్ సూచన

బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణానికి సింగూర్ జలాశయం నుంచి సరఫరా అవుతున్న తాగు నీటి రంగు మారి వస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కమిషనర్ అత్యవసర సూచనలు జారీ చేశారు.ప్రస్తుతం సరఫరా అవుతున్న నీటిని ఇంటి సాధారణ అవసరాలకు మాత్రమే వినియోగించాలని, త్రాగునీటిగా మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించవద్దని ప్రజలకు సూచించారు.ఈ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు ఇప్పటికే చర్యలు ప్రారంభించారని, మరో మూడు రోజుల్లో సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే అవకాశం ఉందని తెలిపారు. అప్పటి వరకు పట్టణ ప్రజలందరూ సహకరించి, తాగేందుకు సురక్షితమైన ప్రత్యామ్నాయ నీటినే వినియోగించాలని, మున్సిపాలిటీ జారీ చేసిన సూచనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



# విపత్తుల సమయాలలో సమర్థవంతంగా సేవలు అందించాలి

**అదనపు కలెక్టర్ భుజంగరావు**
**'ఆపద మిత్ర' వాలంటీర్లకు కిట్లు పంపిణీ**








నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :విపత్తులు సంభవించిన సమయాల్లో ఆపద మిత్ర వాలంటీర్లు తక్షణమే స్పందిస్తూ సహాయక చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం ఆపద మిత్ర వాలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. విపత్తుల సమయాలలో సహాయక చర్యలు చేపట్టేందుకు ఉపకరించే 14 రకాల వస్తువులతో కూడిన ఈ కిట్ ను ఎలా ఉపయోగించాలి అనే విషయాల గురించి ఎస్ డీ ఆర్ ఎఫ్ అధికారులు తెలియజేశారు. విపత్తులు సంభవించిన సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆస్తి, ప్రాణ నష్టాన్ని ఎలా నివారించాలి, అత్యవసర సమయాలలో ప్రాథమిక చికిత్స పద్ధతులు, సీ.పీ.ఆర్ చేసే విధానం, తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ, విపత్తులను నిలువరించే శక్తి ఎవరికీ ఉండదని, అయితే ముందస్తు సన్నద్ధతతో ప్రాణ, ఆస్తి నష్టాల్ని చాలా వరకు నివారించవచ్చని అన్నారు. ఈ దిశగా క్షేత్రస్థాయిలో ఉండే ఆపద మిత్ర వాలంటీర్లు విపత్తుల సమయాలలో సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఇప్పటికే వాలంటీర్లకు ప్రకృతి వైపరీత్యాల సమయాలలో ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై నిపుణుల ద్వారా శిక్షణ అందించామని గుర్తు చేశారు. నేర్చుకున్న అంశాలను విస్మరించకుండా ఆపద సమయాలలో ప్రజలకు సహాయకారులుగా నిలవాలని ఉద్బోధించారు. అదే సమయంలో స్వీయ రక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. జిల్లా రెవెన్యూ అధికారి గీత మాట్లాడుతూ, ఆపద సమయాలలో ప్రజలకు సహాయపడే అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావించాలని అన్నారు. ఆపద మిత్ర నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి సాయన్న మాట్లాడుతూ, ఆపద మిత్ర వాలంటీర్లకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు గుర్తింపు కార్డులు, ఉపకరణాలతో కూడిన కిట్లు అందజేసిందని, బీమా సదుపాయం వర్తింపజేస్తుందని గుర్తు చేశారు. ఈ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ డీ-సెక్షన్ పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు, ఆర్ఎస్ఐ శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ, 7వ పోలీసు బెటాలియన్ అధికారులు, ఆపద మిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

# రెండవ రోజుకు చేరిన మాతా శిశు ఆసుపత్రి సిబ్బంది ఆందోళన

**సస్పెండ్ చేసిన నర్సులకు మద్దతుగా డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది నిరసన**

బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలో మాతా శిశు ఆసుపత్రిలో సస్పెండ్ అయిన ఇద్దరు నర్సులకు మద్దతుగా వైద్యులు, పారామెడికల్ సిబ్బంది చేపట్టిన నిరసన రెండో రోజూ కొనసాగింది.ఆసుపత్రి ఎదుట నిర్వహించిన ఆందోళనలో వైద్యులు, సిబ్బంది పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్లు శ్రీలత, ప్రకాష్ మాట్లాడుతూ బాలింతల అస్వస్థత ఘటనకు సంబంధించి ఇద్దరు నర్సులను సస్పెండ్ చేయడం, అనిస్తీషియా వైద్యుడిని విధుల నుంచి తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. తప్పు జరిగిందని భావిస్తే ముందుగా మెమో జారీ చేసి వివరణ కోరాల్సి ఉందని, నేరుగా సస్పెన్షన్, తొలగింపు చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలతో వైద్య సిబ్బంది మనోధైర్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఏరియా ఆసుపత్రికి వివిధ మండలాల నుంచి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో రోగులు వస్తున్నారని, వారికి మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు, సిబ్బంది నిరంతరం సేవలందిస్తున్నారని తెలిపారు. సమస్యపై ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి సిబ్బందికి న్యాయం చేయాలని కోరారు. సస్పెన్షన్ ఉత్తర్వులను వెంటనే ఎత్తివేయాలని, విధుల నుంచి తొలగించిన మత్తు వైద్యుడిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, సిబ్బందిపై తీసుకున్న చర్యలను పునసమీక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో డాక్టర్లు శ్రీలత, ప్రకాష్, సాయిలు, శ్వేత, ప్రవీణ్,



సంతోష్‌కుమార్‌తో పాటు పారామెడికల్ సిబ్బంది సాగర్, హిమాయత్, మహేష్, హెడ్ నర్స్ అమృత తదితరులు పాల్గొన్నారు.

# బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రికి కొత్త సిబ్బంది మంజూరు

**అనస్తీషియా, పిల్లల వైద్య నిపుణులతో పాటు 17 మంది నర్సుల నియామకం**

బిచ్కుంద, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రికి ప్రభుత్వం 22 కొత్త సిబ్బంది పోస్టులను మంజూరు చేసింది. ఇందులో ఐదుగురు వైద్యులు, 17 మంది నర్సింగ్ సిబ్బంది ఉన్నారు. చాలా కాలంగా సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆసుపత్రికి ఈ నిర్ణయం ఉపశమనం కలిగించనుంది. ఆసుపత్రి సూపరిండెంట్ డా.కాళిదాస్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ వివరాలను వెల్లడించారు. కొత్త సిబ్బంది అందుబాటులోకి రావడంతో ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని ఆయన తెలిపారు. మంజూరైన వైద్య పోస్టుల్లో ఇద్దరు అనస్తీషియా స్పెషలిస్టులు, ఒక పిల్లల వైద్య నిపుణుడు, ఇద్దరు ఎంబీబీఎస్ జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు ఉన్నారు. వీరితో పాటు 17 మంది నర్సింగ్ సిబ్బంది నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రిపై పరిసర ప్రాంతాల్లోని 20కి పైగా గ్రామాల ప్రజలు వైద్య




సేవల కోసం ఆధారపడుతున్నారు. ఇప్పటివరకు స్పెషలిస్ట్ వైద్యులు, తగినంత నర్సింగ్ సిబ్బంది లేకపోవడంతో పలువురు రోగులు మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. కొత్తగా ఇద్దరు అనస్తీషియా వైద్యులు రానుండటంతో అత్యవసర చికిత్సలు, ప్రసూతి ఆపరేషన్ల నిర్వహణకు మరింత అవకాశం కలగనుంది. అలాగే పిల్లల వైద్య నిపుణుడు అందుబాటులోకి రావడంతో చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు లభించనున్నాయి. 17 మంది నర్సుల నియామకంతో ఓపీ, ఇన్‌పేషెంట్ వార్డుల్లో సేవలు వేగవంతం కానున్నాయి. ఈ సందర్భంగా డా. కాళిదాస్ మాట్లాడుతూ, "ప్రభుత్వం మంజూరు చేసిన 22 పోస్టులు ఆసుపత్రి అభివృద్ధికి ఎంతో కీలకం. కొత్త సిబ్బంది చేరిన వెంటనే ఓపీ సేవలను విస్తరించడంతో పాటు అత్యవసర, మాతృశిశు సంరక్షణ సేవలను 24 గంటలూ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతాం" అని తెలిపారు. త్వరలోనే నియామక ప్రక్రియ పూర్తి చేసి కొత్త సిబ్బందితో విధులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సిబ్బంది మంజూరుతో బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన, అందుబాటులో ఉన్న వైద్య సేవలు అందించే కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## భారీ వర్షాలతో జుక్కల్‌లో జనజీవనం అస్తవ్యస్తం

జుక్కల్, బతుకమ్మ :జుక్కల్ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో జుక్కల్ మండలంలోని కౌలాస్ నాల ప్రాజెక్టులో బుధవారం తొలిసారిగా స్వల్పంగా వరద నీరు చేరింది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి రెండు రోజులుగా మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కౌలాస్ ఎగువ పరివాహక ప్రాంతంలో కూడా భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి 740 క్యూసెక్కుల వరద నీరు చేరిందని ప్రాజెక్టు ఏఈఈ అశ్విని తెలిపారు. కౌలాస్ నాల ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 458 మీటర్లు (1.237 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 454.40 మీటర్ల నీటి మట్టం నమోదైనట్లు ఆమె వెల్లడించారు. ఇదిలా ఉండగా, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జుక్కల్ మండలంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈదురుగాలులతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు వంగిపోవడంతో పాటు విద్యుత్ తీగలు తెగిపోయాయి. అక్కడక్కడ చెట్లు నేలకూలాయి



## తాడ్కోల్‌లో భారీ కార్డన్ సెర్చ్

**13 బైక్‌లు, ఓ ఆటో జప్తు**



బాన్సువాడ, బతుకమ్మ :జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాన్సువాడ డీఎస్పీ విట్టల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామంలోని రాజారాం దుబ్బా ప్రాంతంలో భారీ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 140 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కార్డన్ సెర్చ్ సందర్భంగా 112 మోటార్ సైకిళ్లు, 5 కార్లు, 18 ఆటోలను తనిఖీ చేశారు. వీటిలో సరైన ధ్రువపత్రాలు లేని 13 మోటార్ సైకిళ్లు, ఒక ఆటోను పోలీసులు జప్తు చేశారు. అనంతరం కాలనీ ప్రజలకు రోడ్డు భద్రతా నిబంధనలు, ఆన్లైన్ బెట్టింగ్ వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాల నుంచి రక్షణ, గంజాయి నిర్మూలన, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డీఎస్పీతో పాటు బాన్సువాడ డివిజన్ సీఐలు, ఎస్సైలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.



## 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చు వివరాలు కోరుతూ బీజేపీ నేత ఆర్టీఐ దరఖాస్తు

భిక్కనూర్, బతుకమ్మ :గ్రామపంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై పూర్తి వివరాలు కోరుతూ భిక్కనూర్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొందుగుల భాస్కర్ సమాచార హక్కు చట్టం - 2005 కింద మంగళవారం దరఖాస్తు చేశారు. 2026 జనవరి 1 నుంచి ఇప్పటివరకు 15వ ఆర్థిక సంఘం నిధులను ఏ విధంగా ఖర్చు చేశారో పూర్తి వివరాలను అందించాలని ఆయన తన దరఖాస్తులో కోరారు. నిధుల ద్వారా చేపట్టిన పనులు, జారీ చేసిన చెక్కుల వివరాలు, ఏ ఏ పనుల కోసం చెల్లింపులు జరిగాయో, వాటికి సంబంధించిన గ్రామపంచాయతీ తీర్మానాలు, ఇతర రికార్డుల ప్రతులను ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ప్రజాధనం వినియోగంలో పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ ప్రజలకు నిధుల ఖర్చు వివరాలు అందుబాటులో ఉండాలని, తద్వారా పాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని పేర్కొన్నారు. ఆర్టీఐ దరఖాస్తు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది.



## బోనాల పండుగకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

రుద్రూర్, బతుకమ్మ :రుద్రూర్ మండల కేంద్రంలో వచ్చే నెల 2 వ తేదీ ఆదివారం రోజున బోనాల పండుగ నిర్వహిస్తున్న సందర్భంగా బుధవారం రోజున బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని స్థానిక మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి బోనాల పండుగకు ఆహ్వానించారు. ఎమ్మెల్యే పోచారంను కలిసిన వారిలో గ్రామ సర్పంచ్ ఇందూర్ సునీత చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, నాయకులు పత్తి రాము, తోట సంగయ్య, అక్కపల్లి నాగేందర్, శంకర్ పటేల్, కర్క అశోక్, అడప శంకర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



## బాన్సువాడలో మూడేళ్ల చిన్నారిపై

# వీధి కుక్కల దాడి...





బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలోని మదీనా కాలనీలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మూడేళ్ల చిన్నారిపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి ఏడుపు విని స్థానికులు వెంటనే స్పందించి కుక్కలను తరిమికొట్టి బాలికను రక్షించారు. గాయపడిన చిన్నారిని వెంటనే బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో మదీనా కాలనీతో పాటు పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు ప్రజలపై దాడి చేసిన ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, ఉదయం నడకకు వెళ్లే వృద్ధులు, మహిళలు వీధి కుక్కల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. వీధి కుక్కల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టి, వాటిని పట్టుకొని సురక్షిత కేంద్రాలకు తరలించడంతో పాటు ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు వెంటనే అమలు చేయాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ఈ ఘటన పునరావృతం కాకుండా పట్టణంలో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

# అనాథ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

## యూత్ ఫర్ సేవ – ఐఎస్ఆర్డీ ఆధ్వర్యంలో

## గ్రామీణ విద్యార్థులకు చేయూత




కామారెడ్డి, బతుకమ్మ :అనాథ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అండగా నిలిచేందుకు యూత్ ఫర్ సేవ సహకారంతో ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐఎస్ఆర్డీ), సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సదాశివనగర్ మండలంలోని మర్కల్, ధర్మారావుపేట్ గ్రామాలకు చెందిన తల్లిదండ్రులు లేని బాలబాలికలకు బుధవారం స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, జ్యామెట్రీ బాక్స్‌లు, డ్రాయింగ్ బుక్స్ తదితర విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు నిరంతరంగా చదువును కొనసాగించేందుకు అవసరమైన సహాయాన్ని అందించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. మర్కల్ సర్పంచ్ ప్రియాంక సుభాష్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావడంతో పాటు ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. గ్రామ విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించిన యూత్ ఫర్ సేవ, సామాజిక సమరసత వేదిక, ఐఎస్ఆర్డీ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. ధర్మారావుపేట్ సర్పంచ్ షేక్ ఉమర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో సమాజం భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. సేవా సంస్థలు, దాతలు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. "సమాజం మనకేమిచ్చిందనే దానికంటే, సమాజానికి మనం ఏమి చేయగలమనే ఆలోచనతో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి" అని అన్నారు. మండల విద్యాధికారి యూసెఫ్ మాట్లాడుతూ, విద్యార్థుల అవసరాలను గుర్తించి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, వీటి ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మారావుపేట్ సర్పంచ్ షేక్ ఉమర్, మండల విద్యాధికారి యూసెఫ్, మర్కల్ సర్పంచ్ ప్రియాంక సుభాష్ రెడ్డి, ఉపసర్పంచ్ గుర్రపు లింగం, యూత్ ఫర్ సేవ ప్రతినిధులు, సామాజిక సమరసత వేదిక సభ్యులు, ఐఎస్ఆర్డీ ప్రతినిధులు సోలంకి రవళి, అమృత రాజేంధర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు దయానంద్, సౌమ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి గోదావరి, గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మన ఊరు - మన బడి' పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

## ప్రభుత్వ బడుల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయం

## ప్రభుత్వాలు మారినా.. గత ప్రభుత్వ అభివృద్ధి పనులు ఆగకూడదులి

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి






భీమ్ గల్, బతుకమ్మ :గత కేసీఆర్ ప్రభుత్వంలో మన ఊరు మన బడి పథకం కింద అభివృద్ధి పనులను చేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ముచ్కూర్, భీమ్ గల్ పట్టణ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం దాత దయానంద్ రెడ్డి అందించిన సుమారు 2 లక్షల విలువైన 50 డ్యూయల్ డెస్క్ బెంచీలను (ముచ్కూర్ 25,భీంగల్ 25) ఆయన స్థానిక నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ మన ఊరూ మన బడి పనులు, పెండింగ్ బిల్లుల విషయాన్ని తాను అసెంబ్లీలో లేవనేత్తుతనని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో 'మన ఊరు--మన బడి' కార్యక్రమం కింద నియోజకవర్గం లో అనేక పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని గుర్తు చేశారు. ముచ్కూర్‌లో కాంట్రాక్టర్లు సొంత నిధులతో శ్లాబ్ పనులు పూర్తి చేసి సుమారు రూ.30 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించలేదని విమర్శిం చారు. పెండింగ్ బిల్లుల కారణంగానే రాష్ట్రవ్యా ప్తంగా అనేక పాఠశాలల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అధికార పార్టీ నాయకులు కూడా రాజకీ యాలు పక్కనపెట్టి పెండింగ్ బిల్లులు విడుదలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై తీవ్ర అసంతృప్తిని ఆయన వ్యక్తం చేశారు. గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. గురువుల ఆశీస్సులతోనే జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, విద్యాభివృద్ధికి సంబంధించిన విషయాల్లో ప్రభుత్వాలు మారినా గత ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను కొనసాగించాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదివి, కష్టపడి వ్యాపార రంగంలో ఉన్నత స్థాయికి చేరుకున్న దయానంద్ రెడ్డి లాంటి వ్యక్తులు నేటి విద్యార్థులకు ఆదర్శమని కొనియాడారు. ప్రతి సంవత్సరం తన సంపాదనలో 5 నుంచి 10 శాతం వరకు సమాజ సేవకు కేటాయిస్తూ విద్యాసంస్థలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కూడా బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని భవిష్యత్తులో తమ గ్రామాలకు, పాఠశాలలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు, విద్యాభివృద్ధికి సంబంధించిన అంశాల్లో రాజకీయాలు చేయడం తగదని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వాలు మారినా గత ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాలను కొనసాగించడం పాలకుల బాధ్యత అని పేర్కొన్నారు. ఇటీవల ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు నేలపై కూర్చుని చదువుతున్న దుస్థితిని చూసి దయానంద్ రెడ్డి సహకారంతో 40 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందించామని, పలు పాఠశాలలకు సైన్స్ కిట్లు కూడా అందించినట్లు గుర్తు చేశారు. ముచ్కూర్ లో పాఠశాలకు సైన్స్ కిట్ అవసరమని ఉపాధ్యాయులు కోరగా, దయానంద్ రెడ్డితో మాట్లాడి అందించే ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన రాజకీయ లక్ష్యమని పేద విద్యార్థులకు అండగా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చే దాతలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సయ్య, మాజీ జడ్పీటీసీ రవి, మాజీ ఎంపీపీ మహేష్, కౌన్సిలర్లు నీలం రవి, భగత్, నర్సాయ్య, మల్లెల ప్రసాద్, ముచ్కూర్ గ్రామ సర్పంచ్, మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వేల్పూర్ లో ఘనంగా భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

## ఆకట్టుకున్న భజనలు, సాంస్కృతిక నృత్యాలు





బాల్కొండ, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ శివారులో గల కుండలిని జ్ఞాన యోగి, అవధూత బ్రహ్మ, స్వర్ణజ్ఞాని శ్రీ శ్రీ శ్రీ గోవింద గిరి స్వామి దివ్య యోగాశ్రమంలో బుధవారం సప్త భజనలు ఘనంగా ముగిశాయి. గురు పౌర్ణమి వేడుకల్ని అశేష భక్తజనం మధ్య భక్తిశ్రద్ధలతో విశేషంగా ఘనంగా నిర్వహించారు. సాయిబాబా దేవాలయం, ధ్యాన మందిరంలో ప్రభాతవేళ అర్చకులు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోవింద గిరి స్వామి శిష్యులు, భజన కళాకారులు "గురుని రూపం గురుని రూపం దివ్యమైనది గురుని రూపం, మూడు కొండలు గల పర్వతంబు వెలుగు చీకటి లేనట్టి స్థలము, శ్రీనివాస తిరుపతి వేంకటేశ దీనబంధు రక్షించు సర్వేశ, వడ్డీ కాసులవాడా గోవిందా, నిన్ను కన్నులా జూడక ఎన్ని దినములాయెనయ్యా" అంటూ చక్కని భజనలు చేశారు. అనంతరం మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన మెండె పద్మిని మహేందర్ దంపతులు, కుటుంబ సభ్యులు గురుపాదుకాపూజ చేశారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన 9వ తరగతి విద్యను అభ్యసిస్తున్న గడ్డి అక్షర మహాగణపతిం, ఆండాలమ్మ అనే పాటపై చక్కటి క్లాసికల్ నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఏడు రోజులు ఏడు రాత్రులు నిరవధికంగా వీణను ధరించారు. వీణను తొలిరోజు ధరించిన గోవింద గిరి స్వామి శిష్యుడు రాఘవేంద్ర స్వామి సప్త భజనలకు, వీణాధారణకుకు ఉద్వాసన పలికారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రాఘవేంద్ర స్వామి మాట్లాడుతూ అజ్ఞానం అనే చీకటిని తొలగించి జ్ఞానం అనే వెలుగును పంచే గురువులకు కృతజ్ఞతలు తెలిపే పవిత్ర రోజే గురు పౌర్ణమి అని, దీనిని వ్యాస పౌర్ణమి అని కూడా అంటారని తెలిపారు. నాలుగు వేదాలను విభజించి, మహాభారతాన్ని, పురాణాలను రచించిన ఆది గురువు వేద వ్యాసుడు ఆషాడ పౌర్ణమి రోజున జన్మించారని, గోవింద గిరి స్వామి సైతం తమను విశ్వసించిన ఎందరికో చక్కటి దిశ మార్గనిర్దేశం చేశారు. ఏడాది కోమారు భక్తులందరూ కలిసి ఇలా గురు పౌర్ణమి జరుపుకోవడం చాలా ఆనందదాయకమని, ఈ శుభ సందర్భంగా ఆశ్రమంలో కనీవిని ఎరుగని రీతిలో గురు పౌర్ణమి వేడుకల్ని నిర్వహించుకున్నామని అన్నారు. గురు పౌర్ణమి వేడుకల్లో కమిటీ సభ్యులు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాలు, గ్రామాలలోని గోవింద గిరి స్వామి శిష్యులు, భజన కళాకారులు, సాయి సేవకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిపై వరుణుడి పంజా

తాడ్వాయి, కామారెడ్డి, దోమకొండ, మహమ్మద్ నగర్ మండలాలు ఎక్సెస్ కేటగిరీలో ఉన్నాయి.

**. . . కళ్యాణి ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత**

ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 409 అడుగులకు చేరుకోవడంతో రెండు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 430 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అంతే స్థాయిలో ఔట్‌ఫ్లో కొనసాగుతోందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**. . . నిజాంసాగర్‌లో పెరిగిన వరద ప్రవాహం**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా చేరుతోంది. గత 24 గంటల్లో ప్రాజెక్టులోకి 8 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా, పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 1395.40 అడుగులకు చేరుకుంది. నీటి నిల్వ 7.139 టీఎంసీలుగా ఉంది. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టులో నీటి నిల్వ 4.592 టీఎంసీలు, నీటిమట్టం 1391.25 అడుగులుగా ఉండగా, ఈ ఏడాది ప్రస్తుతం నిల్వ గణనీయంగా పెరిగింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టుల పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్



కామారెడ్డి, బతుకమ్మ :మండల పరిధిలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుం డా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎస్సై పుష్పరాజ్ పలు సూచనలు చేశారు. పాత, శిథిలా వస్థలో ఉన్న ఇళ్లలో ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు సమీ పంగా వెళ్లవద్దని హెచ్చరించారు. అదేవి ధంగా పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప ప్రజలు బయటకు రావద్దని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఎవరైనా వరద నీటిలో లేదా ఇతర ప్రమాదకర ప్రాంతాల్లో చిక్కుకున్నట్లయితే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువుగట్లు, పొంగిపొర్లుతున్న వాగుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా చూసుకోవాలని ఎస్సై పుష్పరాజ్ సూచించారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలి

ఫిర్యాదులపై తక్షణ స్పందన అవసరం
నగర కమిషనర్ సాయి చైతన్య

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడంలో ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని, మహిళలు, వృద్ధులు, అత్యవసర సహాయం కోరే ప్రజల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో సీపీ బుధవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు పోలీస్ అధికారులు, సిబ్బంది గౌరవ వందనం సమర్పించగా, ఆయన స్వీకరించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బందికి అందుబాటులో ఉన్న కిట్ ఆర్టికల్స్, భద్రతా పరికరాలు, ఆయుధాల నిర్వహణ, రికార్డుల సంరక్షణ వంటి అంశాలను పరిశీలించి, వాటి నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి ఫిర్యాదుల నమోదు విధానం, రిజిస్టర్ల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంగా స్వాగతించి, వారి సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించే విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. కేసుల నమోదు, పెండింగ్ కేసుల దర్యాప్తు, బీట్ వ్యవస్థ, రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన




వ్యక్తులపై పర్యవేక్షణ వంటి అంశాలను పరిశీలించిన కమిషనర్, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో అమలవుతున్న “5 ఎస్ విధానం” అమలు తీరును కూడా సమీక్షించారు. రికార్డుల డిజిటల్ నిర్వహణ, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది హాజరు, డ్యూటీ విధానాలపై ఆరా తీసిన కమిషనర్, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం పెరిగేలా క్రమశిక్షణతో, పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. ప్రధానంగా అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్న కమిషనర్, ప్రతి కేసుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సబ్ ఇన్స్పెక్టర్లకు సూచించారు. దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పాఠశాలలు, కళాశాలలు మరియు సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ పోలీస్ అధికారులు ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా పనిచేయాలని, ముఖ్యమైన సమాచారాన్ని ఉన్నతాధికారులకు



చేరవేయాలని తెలిపారు. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ప్రధాన రహదారులపై నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని కమిషనర్ ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రధాన కూడళ్లలో ఎన్‌ఫోర్స్ మెంట్ చేపట్టాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాలని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్స్, గేమింగ్ యాప్‌ల వల్ల యువత ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్న కమిషనర్, సైబర్ మోసాలు మరియు ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే డ్రగ్స్ నియంత్రణకు యువతలో అవగాహన పెంచాలని, అన్ని గ్రామాల్లో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది 24ః7 తమ హెడ్‌క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ఈ వార్షిక తనిఖీలో నిజామాబాద్ ఏసీపీ బి.ప్రకాష్ యాదవ్, సీసీఆర్బీ ఏసీపీ గురు నాయుడు, నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌ఓ సి.హెచ్. శ్రీనివాస్, ఎస్ఐ–1 ఎం.డి. షరీఫ్, ఎస్ఐ–2 ఎ. ఆనంద్ సాగర్, ఎస్ఐ–3 ఎ. మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

డిజిటల్ నమోదు తక్కువగా ఉన్న బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలి
మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

వేల్పూర్, బతుకమ్మ అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు, బోగస్ ఓట్లను అరికట్టి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి రెవెన్యూ అధికారులను కోరారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించిన అనంతరం తక్కువ నమోదు ఉన్న పోలింగ్ బూత్‌ల వివరాలతో కూడిన వినతిపత్రాలను బీఆర్ఎస్ పార్టీ పక్షాన అన్ని మండలాల తహసీల్దార్లకు ఎమ్మెల్యే అందజేశారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు నిన్నటి నుండి కమ్మర్‌పల్లి, మోర్తాడ్, బాల్కొండ, మెండోరా, తదితర మండలాల్లో పర్యటించిన ఆయన ఆయా మండలాల తహసీల్దార్లతో సమావేశమై స్థానికంగా ఉన్న ఇబ్బందులపై చర్చించారు.నియోజకవర్గంలో ‘నో మ్యాపింగ్, ‘పర్మినెంట్ షిఫ్టింగ్ సగటు 4 శాతంగా ఉందని, అంతకంటే ఎక్కువ ఉన్న బూత్‌లను గుర్తించి అధికారులకు నివేదించారు. అలాగే, డిజిటల్ నమోదు సగటు 89 శాతంగా ఉందని, అంతకంటే తక్కువ నమోదు ఉన్న బూత్‌ల వివరాలను తహసీల్దార్లకు అందజేసి వాటిలో క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన చేయాలని కోరారు. బుధవారం భీమ్‌గల్, వేల్పూర్ మండలాల్లో పర్యటించిన ఆయన భీమ్‌గల్ తహసీల్దార్‌తో సమావేశమై భీమ్‌గల్ మండలంలోని మొత్తం 56 పోలింగ్ బూత్‌లకు గాను 24 బూత్‌లలో (14ం10) నమోదు





ప్రక్రియ సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించారు. అందులో 14 బూత్‌లలో నమోదు అత్యల్పంగా ఉండటమే కాకుండా, నో మ్యాపింగ్, ఆబ్సెంట్, పర్మినెంట్ షిఫ్టింగ్ వాల్యూస్ అత్యధికంగా ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరో 10 బూత్‌లలో డిజిటల్ నమోదు 89 శాతం కంటే తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఈ 24 సమస్యాత్మక బూత్‌లపై తహసీల్దార్ ప్రత్యేక దృష్టి సారించి, వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. బూత్ లెవల్ అధికారులను (బీ ఎల్ ఓ స్ ), బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లతో (బీ ఎల్ ఏ స్ ) సమన్వయం చేసుకుని ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలను పునఃపరిశీలన చేయాలని ఆదేశించారు. వేల్పూర్ మండలంలో కూడా ఓటరు నమోదు శాతం తక్కువగా ఉన్న బూత్ ల వివరాలను రెవెన్యూ అధికారులకు అందజేసి ఇంకా సమయం ఉన్నందున అర్హులైన ఒక్క ఓటరు కి అన్యాయం జరగకుండా ఓటరు నమోదు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా అర్హుడైన ఏ ఒక్క ఓటరు తన ఓటు హక్కును కోల్పోకూడదని, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను, దొంగ ఓట్లను, మరణించిన వారి ఓట్లను జాబితా నుండి తక్షణమే తొలగించాలన్నారు. ఎస్ఐఆర్ ప్రోగ్రామ్‌ను పూర్తి పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి కోరుతూ బీఆర్ఎస్ పార్టీ పక్షాన నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లకు సమగ్ర వివరాలతో కూడిన వినతిపత్రాలను సమర్పించినట్లు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా అనుపమ సుబేదార్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్‌కు చెందిన అనుపమ సుబేదార్ రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ 315 చైర్మన్‌గా ఎన్నికయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్న ఎన్నికలు హైదరాబాద్‌లోని తాజ్ హోటల్‌లో ఇటీవల నిర్వహించారు. ఈ ఎన్నికల్లో డిస్ట్రిక్ట్ పరిధిలోని 35 క్లబ్‌లకు చెందిన 22 మంది అధ్యక్షులు, 190 మంది కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని హైదరాబాద్ క్లబ్ ప్రతినిధులు సృజన, స్పందన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ పద్మ శర్మ కన్వీనర్‌గా, రమాదేవి, ఉమారాణి కో–కన్వీనర్లుగా, లక్ష్మీ మాధవి లత క్లబ్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ చైర్మన్ అనుపమ సుబేదార్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించడం మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడేలా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని చెప్పారు. ముఖ్యంగా మహిళా సాధికారత, ఆడపిల్లల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనుపమ సుబేదార్ ఎన్నికపై నిజామాబాద్ ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు సులక్షణ, కార్యదర్శి ప్రసన్న, పీడీసీ శైలజ, స్వరూప రెడ్డి, సౌందర్య తదితర రోటరీ క్లబ్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.




# మావోయిస్టు కీలక నాయకుడు మిసిర్ బెస్రా అరెస్టు

మిశ్రాపై కోటి రూపాయలకు పైగా రివార్డు



వెబ్ డెస్క్, బతుకమ్మ :సిపిఐ (మావోయిస్ట్)కి చెందిన చివరి సెంట్రల్ కమిటీ (సిసి), పొలిట్‌బ్యూరో సభ్యుడైన మిసిర్ బెస్రాను మంగళవారం జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో అరెస్టు చేశారు. సిపిఐ (మావోయిస్ట్) కి చెందిన చివరి సెంట్రల్ కమిటీ (సిసి), పొలిట్‌బ్యూరోల సభ్యుడైన మిసిర్ బెస్రాను మంగళవారం జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో అరెస్టు చేసినట్లు సిఆర్‌పిఎఫ్, జార్ఖండ్ పోలీసు అధికారులు తెలిపారు. అతని అరెసుటకు దారితీసే సమాచారం అందించిన వారికి కోటి రూపాయలకు పైగా రివార్డు ఉన్న బెస్రా, భద్రతా ఆపరేషన్ నుండి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా ధన్‌బాద్–గిరిడిహ్ సరిహద్దు సమీపంలోని తుండి–మండియా అటవీ ప్రాంతంలో పట్టుబడ్డాడని వారు చెప్పారు. అతని సహచరులైన గౌరవ్ హస్దా, మోచులను కూడా అరెస్టు చేశారు. బెస్రా అరెస్టుతో, నిషేధిత సీపీఐ (మావోయిస్ట్)కి చెందిన క్రియాశీలక కేంద్ర కమిటీ సభ్యులలో ఎవరూ పరారీలో మిగిలిలేరని అధికారులు తెలిపారు. దాని ఉచ్ఛస్థితిలో, ఆ సంస్థకు 40 మందికి పైగా కేంద్ర కమిటీ సభ్యులు ఉండేవారు. గడిచిన సంవత్సరాలలో, భద్రతా దళాలు మిగిలిన 21 మంది క్రియాశీలక కేంద్ర కమిటీ సభ్యులను అరెస్టు చేయడం, హతమార్చడం లేదా వారి లొంగిపోవడాన్ని నిర్ధారించడం వంటివి చేశాయి. లొంగిపోవడానికి నిరంతరం నిరాకరించిన కొద్దిమంది సీనియర్ నాయకులలో బెస్రా కూడా ఒకరు. “అతను పారస్‌నాథ్ ఆలయ పాదాల వద్ద ఉన్న అటవీ ప్రాంతంలో చిక్కుకుపోయాడు. భారీగా బలగాలను మోహరించడం, నిన్న అతని ముఖ్య సహచరులు లొంగిపోవడంతో, రాత్రి 9 గంటల ప్రాంతంలో అతను అడవి నుండి పారిపోవడానికి ప్రయత్నించాడు. రెండు దశాబ్దాలకు పైగా సాగిన పోరాటం తర్వాత అతను సజీవంగా పట్టుబడ్డాడు,” అని పేరు వెల్లడించని ఒక అధికారి తెలిపారు. అరెస్టు గురించి తనకు ఇంకా అధికారికంగా సమాచారం అందలేదని బెస్రా కుమారుడు సిద్ధార్థ్ బెస్రా అన్నారు. మావోయిస్టు నాయకుడిని లొంగిపోవాలని ఒప్పించేందుకు భద్రతా సంస్థలు పదేపదే వారి కుటుంబాన్ని సంప్రదించాయి. “కేవలం 15 రోజుల క్రితం, పోలీసులు వచ్చి ఆయన లొంగిపోవాలని కోరుతూ మరో లేఖ రాయమని నన్ను అడిగారు. నేను ఆయనను 20 ఏళ్లుగా చూడలేదు, కానీ భద్రతా దళాలు ఆయనను సజీవంగా పట్టుకున్నందుకు సంతోషంగా ఉంది,” అని సిద్ధార్థ్ అన్నారు. పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలోని సరందా అడవులలో బెస్రా ఉనికి కొనసాగడమే, ఆ జిల్లాను వామపక్ష తీవ్రవాదానికి సంబంధించి “ఆందోళన కలిగించే జిల్లా”గా కేంద్ర ప్రభుత్వం వర్గీకరించడానికి గల కారణాలలో ఒకటని అధికారులు తెలిపారు. సీనియర్ మావోయిస్టు నాయకులు లొంగిపోవడం, ఎదురుకాల్పులు జరగడంతో, ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌తో సహా ఒకప్పుడు మావోయిస్టులకు ప్రధాన కంచుకోటలుగా ఉన్న చాలా ఇతర జిల్లాలను ఈ జాబితా నుండి తొలగించారు.

# అక్రమ కేసులు ఎత్తివేయాలి

## ప్రభుత్వ సలహాదారును కలిసిన వామపక్ష నాయకులు



హైదరాబాద్, బతుకమ్మ :వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్, న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న దేశవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్‌లో పాల్గొన్న జిల్లాలోని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. నీట్ లీకేజీకి వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి ఉద్యమంలో నమోదైన కేసులను ఎత్తివేయాలని విద్యార్థులు, ప్రజలు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయని తెలిపారు. ఉద్యమ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కేసులు ఎత్తివేస్తామని ప్రకటించినప్పటికీ, రాష్ట్రంలో మాత్రం వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రియాన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ విషయంలో పోలీసులు విద్యార్థి సంఘాల నాయకుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇలాంటి చర్యలు రాష్ట్ర ప్రభుత్వానికి నష్టం కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారును కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన సుదర్శన్ రెడ్డి, పోలీస్ కమిషనర్‌తో మాట్లాడి కేసుల ఉపసంహరణకు చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నీట్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయన కూడా విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సీపీఐ(ఎం ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, మాస్ లైన్ పార్టీ నగర కార్యదర్శి ఎం. సుధాకర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె. గణేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతులపై నిర్బంధమా ?

## విద్యార్థి నాయకులపై కేసులు ఎత్తివేయాలి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :విద్యార్థి సంఘాల నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎస్‌యుఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యు, ఏఐపీఎస్యు, ఏఐఎస్బి సంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన, కార్మిక, మహిళా, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను కేసులతో అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. విద్యార్థి ఉద్యమాల పట్ల పోలీసుల వ్యవహారశైలి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఖండించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ తదితరులు మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని కోరుతూ నిర్వహించిన బంద్‌లో పాల్గొన్న విద్యార్థి నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. నిజామాబాద్‌లోని ఓ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల వద్ద జరిగిన ఘటనను సాకుగా చూపి కేసులు నమోదు చేయడం అన్యాయమని, విద్యార్థి నాయకులు ఇచ్చిన ఫిర్యాదును పక్కనపెట్టి యాజమాన్యం ఫిర్యాదు ఆధారంగా మాత్రమే చర్యలు తీసుకోవడం పోలీసుల ఏకపక్ష వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థి నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, లేనిపక్షంలో అఖిలపక్షాలు, విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సమావేశం హెచ్చరించింది. పోలీస్ కమిషనర్ నిష్పాక్షికంగా వ్యవహరించి కేసుల ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ సమావేశంలో పలు ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు, కార్మిక, మహిళా, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్నేహ సొసైటీలో స్వాతంత్ర్య వేడుకలు

## విద్యార్థులకు వివిధ రకాల పోటీలు





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలోని దివ్యాంగుల పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మానసిక, అంధ దివ్యాంగ విద్యార్థులకు వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ డ పెయింటింగ్, క్విజ్, ఉపన్యాసం, పాటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు విజయానందరావు, దారం గంగాధర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. క్విజ్ పోటీల్లో భాగంగా విద్యార్థులను పలు గ్రూపులుగా విభజించి సుమారు 48 నుంచి 50 ప్రశ్నలు అడగగా, విద్యార్థులు ఉత్సాహంగా సమాధానాలు ఇచ్చారు. అనంతరం అంధ దివ్యాంగ విద్యార్థులకు ఉపన్యాసం, పాటల పోటీలను నిర్వహించారు. అలాగే మానసిక దివ్యాంగ విద్యార్థులు చిత్రీకరించిన చిత్రాలను, వారు ఆలపించిన పాటలను న్యాయనిర్ణేతలు ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా విజయానందరావు, దారం గంగాధర్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల్లో సకలాంగుల కంటే ఏమాత్రం తీసిపోనీ మేధోసంపత్తి దాగి ఉందని అన్నారు. విద్యార్థులు చెప్పిన సమాధానాలు, వారు గీసిన చిత్రాలు వారి ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు అనేక అవకాశాలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నప్పటికీ, కొంతమంది వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవుతున్నారని వారు తెలిపారు. అయితే ఇక్కడి విద్యార్థులు మానసిక దివ్యాంగులైనప్పటికీ, స్వయంగా చదవడంలో ఇబ్బందులు ఉన్నా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని నేర్చుకుంటూ ఎలాంటి భయాందోళనలు లేకుండా ధైర్యంగా తమ ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. స్నేహ సొసైటీ నిర్వాహకులు ఎస్. సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయ సిబ్బంది చేస్తున్న సేవలు మానసిక దివ్యాంగ పిల్లలను నిర్లక్ష్యం చేసే తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని వారు ప్రశంసించారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని విజయానందరావు, దారం గంగాధర్‌లను స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్. సిద్దయ్య, అందుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, దాతలు రామ్ సృజన్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా పని చేయాలి

## కామారెడ్డి జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర




కామారెడ్డి, బతుకమ్మ : ప్రతి పోలీసు ఉద్యోగి ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర సూచించారు. సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, రైటర్ రూమ్, వివిధ రికార్డులు, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, ఇతర విభాగాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, పరిశుభ్రత, నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పరిశుభ్రమైన పోలీస్ స్టేషన్ సిబ్బందిలో సానుకూల వాతావరణాన్ని కల్పించి, విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదపడుతుందని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, నిష్పాక్షికంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యే ప్రతి కేసు, పిటిషన్‌ను తప్పనిసరిగా సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి నవీకరించాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని సిబ్బందికి సూచించారు. జిల్లా కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాలు, సూచనలు రోల్‌కాల్‌లో సిబ్బందికి సక్రమంగా చేరుతున్నాయా అనే అంశంపై ఎస్పీ స్వయంగా పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన వ్యవహారశైలి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో సమయం గడపాలని, పిల్లల్లో మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించేలా తల్లిదండ్రులు ఆదర్శంగా ఉండాలని సూచించారు. అలాగే జూదం, ఆన్‌లైన్ గేమింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, వ్యక్తిగత క్రమశిక్షణే వృత్తిపరమైన నిబద్ధతకు పునాది అని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గ్రామ స్థాయిలో పనిచేసే వి.పి.ఓలు తమ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించి స్థానిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని, కీలక సమాచారం లభించిన వెంటనే ఉన్నతాధికారులకు చేరవేయాలని ఆదేశించారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలు, జీవన విధానం, కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సదాశివనగర్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ బి. సంతోష్ కుమార్, ఎస్ఐ ఎం. పుష్పరాజ్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రతి నీటి బొట్టు ను ఒడిసి పట్టుకోవాలి...

## ఎంపీఓ శ్రీనివాస్ వెల్లడి

ఇందల్వాయి, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని రైతులకు వివరించాలని, పతి నీటి బొట్టు ను రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని ఎంపీఓ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం తీర్మాన్ పల్లి సర్పంచ్ చింతల కిషన్ తో కలిసి గ్రామ సచివాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల కిషన్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు రైతులను ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని ఎంపీ ఓ శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరు బావుల రీచార్జ్ నిర్మాణాలు, కాలువల నిర్మాణం వంటి నీటి సంరక్షణ చర్యలను గ్రామస్థుల భాగస్వామ్యంతో చేపట్టాలని తెలిపారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల వద్ద ప్రతి కుటుంబం తప్పనిసరిగా ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా ఇంకుడు గుంతల ఏర్పాటు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భూగర్భ జలాల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ ఓ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తీర్మాన్ పల్లి సర్పంచ్ చింతల కిషన్, ఉప సర్పంచ్ జరుగు రవి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రభాకర్, వార్డు సభ్యులు మేకల క్రాంతి, శ్రీనివాస్ యాదవ్, సంతోష్, కరోబర్ నరేందర్, పంచాయతీ కార్యదర్శి తో పాటు గ్రామ పెద్దలు రాజనర్సగౌడ్, శంకర్ గౌడ్, బక్కన్న, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్‌ను కోరిన ఎంపీ ధర్మపురి అర్వింద్

వెబ్ డెస్క్, బతుకమ్మ :జగిత్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌ను పలు కీలక అంశాలపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశంలో పాల్గొంటున్న ఆయన, భారీ వర్షాల నేపథ్యంలో ఈరోజు చరవాణి ద్వారా కలెక్టర్ తో మాట్లాడారు. మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖ, వాటర్ సప్లై, విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల సంస్థ తో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. అలాగే జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల బలహీనంగా ఉన్న కట్టలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. వాతావరణ శాఖ రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర వస్తువులు, స్వచ్ఛమైన తాగు నీరు, వైద్య సేవలు తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని కో రారు. ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,అవ సరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వరద నీరు ప్రవహిస్తున్న ప్రాం తాలు, వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దని, జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.